# కెవ్వు లవ్వు

వయసు మళ్ళిన వాడు లవ్వాడినా పెళ్ళాడినా 'కెవ్వు' మన్పించలేడు !. ప్రేమకు వయోబేధం లేదంటారుగాని అది పచ్చి అబద్ధం!

లవ్వనేది స్వీట్‌గ వుంటుందనేది వట్టి 'బాష్'! పెద్ద కట్టు కథ ! కేవలం కవుల వర్ణన... దట్సాల్ ! ముద్దు తియ్యగా వుంటుదన్నది కూడా అంతే పెద్ద అబద్ధం ! ఇవన్నీ వూసుపోక కవులు చేసే వర్ణనలు !

పాపం ఇవన్నీ నిజమేననుకున్న వారంతా లవ్‌లో పడుతుంటారు. సరదాగ పార్కుల వెంట చక్కర్లు... బోటు షికార్లు.... సెకండ్‌షో సినీమాలకు... వారానికి పదిసార్లు పబ్బులకు వెళ్ళి ప్రేమికుడి నెత్తికి కే(స్ట్రాయిల్ రాస్తూంటారు. గుండు గీకిస్తారు. అవసరాలు తీరాక వాడినొక వెర్రివెదవను చేసి పారేస్తారు 'సోకాల్డ్' ప్రియురాళ్లు.

'ప్రేమ ఎంత మధురం...' అని కవిరాసిన పాటకి ట్యూన్ కట్టి విన్పించినంత మధురంగ ప్రేమలో నిల్ ! నిల్లో... ఫుల్లో.... ఎవరెన్ని చెప్పినా ఆడ మగ ప్రేమించుకోక మానరు ! ప్రేమ ఒక దురదలాంటిది ! ఒకరి నుండి మరొకరికి పాకే స్కిన్ డిసీజ్ !

లవ్ ఫెయిల్యూర్ వల్లే అనేకానేక హత్యలు... ఆత్మహత్యలు... కిడ్నాపింగులు... మానభంగాలు... భర్తనొదిలేయటాలు... భార్యకు విడాకులు ఇచ్చేయడల్లాంటివి అనేకానేకం జరుగుతున్నయ్ !

ప్రేమలో ఆరాధనాభావం నానాటికీ వ్యక్తుల్లో సన్నగిల్లటంమూలానే నేడు ఎన్నెన్నో అనర్థాలు ! పవిత్రత పూజ్యమౌతోంది.

ప్రేమకవిత్వం.. ప్రేమకథలు.. సాహిత్యం.. సినీమాలు యూత్‌ని తప్పుదోవ పట్టిస్తున్నయ్!

అందరికీ సారీ! (ప్రేమికులకు) ఆదర్శం సలీం-అనార్కలీ... లైలా-మజ్నూ... పార్వతీదేవదాసులు! వీళ్ళు తప్ప అమరప్రేమికులు లేరు(రా?) ! పతివ్రతల పేర్లు చెప్పుకోవాలంటే సీత, సావిత్రి, అనుసూయ, అరుంధతి ఎలాగో పై మూడు ప్రేమజంటలు పడుచువారికే ఆదర్శం!

నేడు ప్రేమ పదానికి నిరవ్వచనం... వెంటపడటం... ఏడిపించటం....

బెదిరించటం.... వప్పుకోకుంటే చంపటం లేదూ యాసిడ్ దాడి చేయటం ! 'అనర్థాల ప్రేగ' మారింది!.

ఈవ్‌టీజింగ్... ర్యాగింగులు వుండనే వున్నయ్. ఆడదాన్ని అనుభవించాలనే వాంఛకే మరో ముద్దుపేరు ప్రేమగా మారింది.

మరో ప్రబల కారణం... కో-ఎడ్యుకేషన్! రెండవది... ఆడపిల్లలకు డ్రెస్‌కోడ్ లేకపోవటం... మూడవది... పేరెంట్స్ నిర్లక్ష్య ధోరణి.

విదేశీ నాగరికతను ఇంపోర్ట్ చేసుకుని నానాటికీ విర్రవీగుతూండటం మరో ముఖ్యమైన రీజన్ !. మగవారిని రెచ్చగొట్టే డ్రస్సులు వేసుకోవటం... శరీరభాగాలకు అతుక్కుపోయి వెళ్ళుకొచ్చేట్టు చేసే దిక్కుమాలిన టేస్ట్ ! మగపిల్లలు రెచ్చిపోతారంటే... పోరూమరి !

అలాంటి పొగరుబోతు డ్రెస్‌తో గుళ్ళోకెళ్ళినా ఆదేవుడు చూచి లొట్టలేయక మానడు ! జొల్లుకార్చుకోకపోడు !

టీ.వీ.లో కన్పించే 'యాడ్స్' లోనూ పచ్చి బూతు !

పత్రికలు... టీ.వీ.లు... సినిమాలు శృతిమించిన మోతాదుల్లో ప్రోత్సహిస్తున్నయ్ ! సినీమా వారిది తప్పు అంటే... ప్రేక్షకులు చూస్తున్నారు... కాబట్టి ఆవిధంగా తీస్తున్నామనేది దర్శక నిర్మాతల వాదన ! చెట్టు ముందా... విత్తు ముందా... అన్నట్టుంటుంది.

ఎంతమంది ఆడవాళ్ళను కిడ్నాప్ చేసి పడుపు వృత్తిలోకి బలవంతాన దించటంలేదు ఈ దేశంలో? దీన్ని నిర్మూలించగలవారేరీ? పరోక్షంగ ప్రోత్సహించబడుతూనే వుంది. తాళికట్టిన భర్తలే తమ భార్యలను డబ్బు కోసమో... ప్రమోషన్ కోసమో... పదవి కోసమో పరాయివాడి పక్కలో పడుకోబెట్టటంలేదు. ఇలాంటివి నిర్మూలింపబడేదెట్లా ?

'ఆపరా గోపాలం నీ సుత్తి ! నీ సుదీర్ఘ వుపన్యాసం ఇక వినే ఓపిక లేదు నాకు...' విసుక్కున్నాడు వినోద్.

ఇద్దరూ ఒకే ఆఫీసులో వర్క్ చేస్తున్న ఆప్తమిత్రులు. అభిప్రాయాలను... కష్ట సుఖాలను కలబోసుకుంటుంటారు.

గోపాలానికి బరువు బాధ్యతలు బోలెడు. అందుకే పెళ్ళి చేసుకోలేదింకా !

ప్రేమ పట్ల విముఖతేకాదు అయిష్టత ఆకాశమంత.

ప్రేమికుల దినోత్సవం ఎందుకు మనదేశంలో జరుపుకుంటున్నారో బోధపడక బుర్ర బద్దలు కొట్టుకుంటాడు. వాలెంటైన్స్ డే విదేశీయం ! ఇంపోర్టెడ్ కల్చర్. దీన్ని మనమెందుకు ప్రోత్సహించాలి? ఈ విచ్చలవిడితనానికి కారకులెవరు?

'ఒరేయ్ మెంటల్... అనవసరంగ ఆలోచించి మనసు పాడుచేసుకోకు! నువ్వొక్కడివే వీళ్ళనుద్ధరించలేవు. ఎవరు నష్టపోతే వాళ్ళే బాధపడతారు. అప్పుడుగానీ తెలిసిరాదు!..... నువ్ నోర్ముయ్ !

'నా బాధంతా నీ సిస్టర్ గురించేరా !... ఇంటి బాధ్యత నేను తలకెత్తుకోక తప్పలేదు. మా మమ్మీని ఇద్దరు పిల్లలను వదిలేసి మా ఇంటి పనిమనిషిని లేపుకుపోయాడు. డాడీ! దాన్ని ప్రేమించాడట! మా ఆస్తి అంతా దానికి దోచిపెట్టాడనేది మమ్మీ వాదన. మా భవిష్యత్‌కేమీ మిగల్చకుండా పనిమనిషితో ఎలో వెళ్ళిపోయి పాతికేళ్ళు దాటుతోంది. అప్పుడు నేను మా చెల్లి చాలా చిన్న వాళ్ళ! మా కోసం మమ్మీ ఎన్నో కష్టాలుపడింది. తాను తిన్నా తినకపోయినా మా కడుపులు నింపి... రెక్కలు ముక్కలు చేసుకుని చదివించి ఇంతటి వాళ్లను చేసింది.

లక్కీగా డిగ్రీ కాగానే నాకు బ్యాంకు జాబు రాబట్టి ఇంటి బాధ్యతను నేను తలకెత్తుకున్నాను. మమ్మీని కష్టాలబారి నుండి తప్పించాను. నా సిస్టర్ మాధురిని పి.జి. చదివించాను. కానీ మాధురి మ్యారేజ్ చెయ్యకపోతున్నా్రా? అది నాలాకాదు. దాని ఆలోచనా ధోరణే భిన్నంగ వుంటుంది. నేటి నాగరికత ప్రభావం దానిపై చాలావుంది. బాగా డబ్బున్న వాడిని ప్రేమించాలని కలలు కంటోంది. రాయల్ లైఫ్ గడపాలన్నది మాధురి ఆరాటం!-నేనెన్నో సార్లు మందలించాను. బట్ దాని మానసిక ధోరణి మార్చలేకపోతున్నాను. ఖర్మగాలి ఏ ఇడియట్ గాడినో ప్రేమించి అన్ని విధాల నష్టపోతుందేమో అనేదే నా భయం...'

'లవ్... మ్యారేజ్ అనే విషయాలు పూర్తిగ నీ సిస్టర్ ఆలోచనలకు నిర్ణయానికే సంబంధించినవి ! నువ్వెంత చెప్పీ నీ సిస్టర్‌ని మార్చలేవు. - బైదిబై... మనఫ్రెండ్స్ సర్కిల్లోనున్న వాళ్ళెవరినైనా నీ సిస్టర్‌కి సజెస్ట్ చెయ్యకపోయావా...'

'నాకే ఐడియా ఎప్పుడో వచ్చింది. నా ప్రపోజల్స్ దానికి నచ్చలేదు. నాతో ఏకీభవించలేదు. బాగా డబ్బున్న సంబంధం... మన్లాంటి మిడిల్ క్లాస్ వారికి దొరకటం

సాధ్యమా?-'

'సర్లే ! బాగాపొద్దుపోయింది, పోదాంపద...' వినోద్ అనటంతో ఇద్దరూ ఎవరిదో వరవాళ్ళు వెళ్ళిపోయారు.

'గోపాలం... ఒరేయ్ గోపాలం... అబ్బ నిద్ర లేవరా... కొంపమునిగింది...' తల్లి గావు కేకలకు వులిక్కిపడిలేచాడు.

'ఏంటమ్మా... ఎందుకలా అరుస్తున్నావ్?-' గోపాలం వళ్లు విరుచుకుంటూ ఆవులించి తల్లి ముఖంలోకి చూస్తూ అడిగాడు.

'మాధురి కన్పించటం లేదురా...'

'అదేమైనా నల్లపూసా కన్పించకపోవటానికి - ఏ బాత్‌రూంలోనో వుంటుంది లేమ్మా...'

'అదికాదురా... దాని టేబులు మీద ఈ వుత్తరం కన్పించింది. ఆత్రంగ చదివాను... ఇంకేముంది... నేను అనుకున్నట్టే అయింది...' భోరుమంది.

'నువ్వేమనుకున్నావా?... అసలేమైంది? ఆవుత్తరంలో ఏంరాసివుందే... నీ ఏడుపు ఆపి విషయం చెప్పు...'

'ప్రేమించిన వాడితో వెళ్ళిపోతున్నానంటూ లెటర్లో రాసిందిరా... అంతకుమించిన వివరాలేం రాయలేదురా, అందులో...' పైటతో కళ్ళొత్తుకుంది.

'దానికిదేం పోయేకాలంరా !... అది ఇట్లాంటి వెధవ్వేషాలేస్తుందని కల్లో కూడా వూహించలేదు. ఏదో బుద్ధిగ చదువుకుంది. ఈ రోజు కాకపోతే రేపైనా దానికి మంచి వుద్యోగం రాకపోతుందా?... మంచి మొగుడుతో సుఖంగ... హాయిగ... దర్జాగ కాపురం చేసుకుంటూ సుఖపడకపోతుందాని మనం అనుకుంటుంటే... ఇలాంటి దౌర్భాగ్యపు పని చేసిందేమిట్రా-

నన్ను మాట్లాడనీయకుండా అమ్మే... తనకడుపులో బాధనంతా వెళ్ళగక్కింది.

'ఇప్పుడేమిటి చెయ్యటం? ఏదైనా ఉపాయం ఆలోచించరా గోపాలం...'

'నాకూ ఏం తోచటం లేదమ్మా...' కాలుగాలిన పిల్లిలా అటు ఇటూ తిరుగుతూ అన్నాను.

'ఇది ప్రేమించిన వాడెవరో నీకు తెలుసా గోపాలం?-ఆ వెధవది ఈ వూరేనా?... ఎక్కడుంటాడ్రా వాడు?... వాడిని వెతికి పట్టుకోరా నాయనా...

'అది అసలు ప్రేమలో పడిన వ్యవహారం కూడా నాకు తెలియదు మమ్మీ ! నువ్వు ఆవేశపడకు...'

'ఒక పని చెయ్యరా... పిల్ల తప్పిపోయిందంటూ పోలీసులకు రిపోర్టు చేస్తేనో...?'

'ఊరుకో మమ్మీ నువ్ మరీను. అదేం చిన్న పిల్ల దాని పరువు మనమే తీసినట్టుంటుంది.'

'పోనీ పేపర్లో వేయిస్తే ?-'

'ఇంకా నయం టీ.వీ.లో చెప్పిస్తే... అన్లేదు ఇలాంటి అనవసరమైన ప్రచారం కల్పించటం చూస్తే అందరిలోనూ చులకనైపోతాం...'

'మరెట్లా రా దాన్ని వెతికి పట్టుకునేది? -' తను ప్రేమిచినవాడెవరో ఏమిటో మనకు చెప్తే... మనమే గౌరవంగ వాళ్ళ పెళ్ళి చేసివుండేవాళ్ళం ! అయినా ఈ కాలం పిల్లలకు ఇదేం మాయరోగం? ఇంట్లో ఇద్దరం పెద్దవాళ్ళం వున్నాం కదా?... అదెట్లా బరితెగించి వెళ్ళిపోవటం ఏమైనా బాగుందా?-'

'ప్రేమించుకున్న వాళ్ళకు... ముందేం జరుగుతుందో అక్కర్లేదు. వాళ్ళ మనసుకు నచ్చినట్టు చేస్తారంతే. రేపేదైనా జరగకూడనిది జరిగితే... మనం ఏడవాల్సివుంటుందంతే... సరేలే... నేనేదో విధంగ నా తంటాలు నేను పడి దాని అచూకీ తెల్సుకుంటాలే మమ్మీ... నిద్రాహారాలు మాని దాని కోసం ఏడుస్తూ కూర్చోకు...'

'కాలు చెయ్యి ఆడక నాకు ఏ పనీ చేయబుద్ధి కావటంలేదు. నువ్వీ పూటకు బైట భోజనం చెయ్... రాత్రి సంగతి ఆలోచిద్దాం...' ఇంతలో పనిమనిషి రావటంతో... తోమటానికి అంట్ల గిన్నెలు దొడ్లో వెయ్యటానికి అనసూయమ్మ కిచన్లోకి నడిచింది.

ఇంట్లో బ్యాంక్‌కెడుతున్నానని చెప్పి బయల్దేరిన గోపాలానికి మనసు గందరగోళంగ వున్నదనిపించటంతో ఆఫీసుకు వెళ్ళాలనిపించలేదు. అవమానభారంతో మనసు కుంగిపోతోంది. చెల్లి ఇలాంటి తెలివి తక్కువ పని చేసినందుకు మనసు బాధకు గురవటాన... వున్మాదిలా వీధులవెంట తిరుగుతూ ఆకలన్పించటంతో హొటల్లో సయించీ సయించక నాలుగు మెతుకులు గతికి పార్క్‌లోకెళ్ళి ఓ చెట్టు కింద పడుకున్నాడు.

మాధురి ఎందుకు ఇలాంటి పిచ్చి పని చేసింది? - అమ్మతో మనసులో మాట చెప్పటానికి భయంతోస్తే... కనీసం తనతోనైనా మాట మాత్రం చెప్పివుంటే ఎంత

బాగుండేది? ఎందుకు ఎవ్వరికీ చెప్పకుండా ఇలాంటి నిర్ణయం తీసుకుంది?

ఎన్నో ప్రశ్నలు గోపాలన్ని వేధించసాగినయ్...

'గోపాలం ! మూడు రోజులుగా ఆఫీసుకు రాలేదేం! వూళ్ళోనేనా వంట్లో బాగోలేదా? లీవ్‌లెటరైనా పంపించలేదేం బ్రాంచి మేనేజర్‌కైనా నువ్ రాని విషయం ఫోన్ ద్వారా తెలియపర్చినట్టు కూడా లేదే...' వినోద్ ప్రశ్నల వర్షం కురిపించాడు.

మౌనంగ వున్న గోపాలాన్ని చూస్తూ 'ఏంట్రా అలా వున్నావ్? ఏమైంది? ఇంట్లో ఏదైనా ప్రాబ్లమా?... లేకపోతే నీకేవైనా మ్యారేజ్ ప్రపోజల్స్ వుంటే... పెళ్ళిచూపులకు వూరేదైనా వెళ్ళావా?

పద... అలా కేంటీన్‌కెళ్ళి మాట్లాడుకుందా...'

అచేతనంగ వినోద్ వెంట నడిచాడు గోపాలం. ఫ్రెండ్‌కేమని చెప్పాలి? చెప్పకుండా వుండగలడు.

కేంటీన్లో ఎవ్వరూ లేరు. అంతా ఖాళీగా వుండటంతో ఓ కార్నర్లో ఇద్దరూ కూర్చున్నారు. రెండు చాయ్‌కి ఆర్డరిచ్చాడు వినోద్.

క్షణంలో చాయ్‌లొచ్చినయ్ !

'ఆ ఇప్పుడు చెప్పరా...' చాయ్ సిప్ చేస్తూ అన్నాడు వినోద్.

'అసలేమిట్రా విషయం?-

'నా సిస్టర్ మాధురి ఇంట్లో చెప్పకుండా వెళ్ళిపోయిందిరా... ' గోపాలంలో దు:ఖం తన్నుకొచ్చింది.

'ప్లీజ్ కంట్రోల్ యువర్‌సెల్ఫ్' కమాన్... టీ తాగుతూ కూల్‌గ మాట్లాడు...

'అది ఎవరినో ప్రేమించిందట! మాతో మాటమాత్రమైనా ఎప్పుడూ చెప్పలేదు. దాన్ని నేనెంతగ ప్రేమిస్తున్నానో నీకు తెలుసుగా...'

'ఎమోషనవకు గోపాలం! మాధురి సరైన నిర్ణయమే తీసుకుందేమో?... తర్వాతగానీ మనకే వివరాలూ తెలియవ్. నువ్వు కంగారుపడో... వుద్రేక పడో... మనసు పాడు చేసుకోకు.

'నాకు ప్రేమ వ్యవహారమంటే గిట్టదని నీకు తెల్సుగా...'

'అందుకే నీకు నీ సిస్టర్ మనసులో నిజాన్ని చెప్పివుండదు. చెప్తే నువ్ నెగెటివ్‌గ మాట్లాడతావని మాధురికి తెల్సు! అందుకు తన లవ్ ఎఫైర్ గురించి నీతో

చెప్పివుండదు... తన నిర్ణయమేదో తాను తీసుకెని వుంటుంది. యామై రైట్... లవ్ మేరేజెస్ అన్నీ ఫెయిలవుతాయనుకోవటం పొరపాటు...'

'గోపాలం... మాకెవ్వరికీ చెప్పకుండా రహస్యంగ నీ సిస్టర్ మారేజ్ చేసేశావా?-' అప్పుడే అక్కడకొచ్చిన కొలీగ్ రమణ అన్నాడు.

'ఎందుకలా అంటున్నావ్?-వినోద్ రమణను అడిగాడు.

'మరేంలేదురా... ఇండస్ట్రియలిస్ట్ రామానుజరావుగారి ఏకైక పుత్రుడు మాధవ్‌తో పక్కన కూర్చుని కార్లో పోవటం చూశాను...'

రమణ మాటలకు గోపాలం స్టన్నయినాడు.

'అలాగా... నువ్ చెప్తోంది నిజమా?-' నిర్ఘాంతపోయాడు వినోద్.

'ఆ మాధవ్‌గాడొట్టి ఇడియట్‌రా! వాడి గురించి సిటీలో అందరికీ తెలుసు! మాధురిలాంటి మంచి అమ్మాయి పోయిపోయి వాడివలలో ఎలాపడిందో వాళ్ళను చూడగానే అర్థంకాలేదు...'

'అతను బ్యాడ్‌ఫెలోనా?- 'గోపాలం గొంతులోంచి ప్రశ్న తన్నుకు వచ్చింది.

'వఠి క్యారెక్టర్‌లెస్ ఫెలోరా బాబూ వాడు. డబ్బులో మునిగితేలేవాడు... రోజుకో అమ్మాయిని లవ్ చేశానంటూ వెంట తిప్పుకుంటాడు. అనుభవించేశాక వదిలేస్తాడంతే! అది వాడి నైజం. ఇప్పటికి సిటిలో చాలామంది అమ్మాయిలు బలైపోయారు...' పూసగుచ్చినట్టు చెప్పాడు రమణ.

'మాధురినీ ట్రాప్‌చేసి వుంటాడు. వాడి గురించి తెలియకపోవటంతో వాడి మాటలు నిజమని నమ్మివుండాలి... అంతేరా గోపాలం... అదే జరిగివుంటుంది.' వినోద్ కన్‌క్లూడ్ చేశాడు.

'ఇప్పుడెలారా మరి...'

'నువ్వు నీ చెల్లెల్ని వెనక్కి తెచ్చుకోవాలని వెళ్ళి వాళ్ళను కల్సినా... ఇద్దరూ మేజర్లు కావటాన... నువ్వు తగవులాడలేవు. డబ్బున్నవాళ్ళతో గెలవలేవ్. మాధవ్ నిజరూపం గురించి చెప్పినా మాధురి వేడిలో వుంటుంది కాబట్టి నమ్మదు. వెళ్ళి అవమానపడటం అనవసరం!... శుద్ధ వేస్ట్...' కుండ బద్దలుకొట్టినట్టు మాట్లాడాడు రమణ.

నెల్లాళ్ళయినా తిర్కముందే వన్ ఫైన్ మార్నింగ్ పోలీస్ స్టేషన్ నుండి ఫోనొచ్చింది. వచ్చి శవాన్ని చూచి వాళ్ళ తాలూకు మనిషి అవునా కాదాని చెప్పమన్నారు.

తన నెంబరు పోలీసువారికెలా తెలిసింది. ఉన్నట్టుండి పోలీసుల నుండి ఈ మెసేజ్ ఏమిటీ?-

అంటే... మాధురి చనిపోయిందా?- ఆత్మహత్యకు పాల్పడిందా? మాధవ్‌ను నమ్మి మోసపోయింది? మాధురి ప్రేమ ఓడిపోయిందా? ప్రేమ ప్రేమను ప్రేమిస్తుందనేది శుద్ధ అబద్ధమేనా?...

హు! చివరకు అంతా ఫ్రెండ్స్ చెప్పినట్టే జరిగివుంటుంది. మాధవ్ తన సిస్టర్‌ను అనుభవించాక 'ఛీ' కొట్టి వుంటాడు ! ఆత్మాభిమానం గల ఆడపిల్ల కావటాన తనముఖం ఇంటికి తిగొచ్చి చూపించలేక హుసేన్ సాగర్‌లో దూకి ప్రాణం తీసుకుని వుంటుంది.

అనేక రకాల ప్రశ్నలతో మనసంతా గందరగోళంగా వుంది. తల్లికిక్కూడా చెప్పకుండా వక్కడే స్కూటర్ మీద బైలుదేరాడు గోపాలం!

పోలీస్‌స్టేషన్ చేరుకున్నాడు! శవాన్ని పోస్టుమార్టం కోసం గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారని చెప్పారు.

ఆమె చావు హత్య కాదని... ఆత్మహత్యేనని పోస్ట్‌మార్టంలో తేలిందని డాక్టర్లు చెప్పగా విన్నాడు.

మార్చురీలో శవాన్ని చూశాడు గోపాలం! అది తన చెల్లెలు మాధురిదే! సిస్టర్ శవాన్ని చూడగానే కుప్పకూలాడు గోపాలం! ప్రేమకు ఓటమి తప్పలేదా మాధురీ... అన్నయ్య మనసు బాధతో మూలిగింది!

కడకు లవ్వు కెవ్వుమంది !! ఏడ్చింది!!

--- సమాప్తం ---